క్లుప్తంగా

గోవిందమ్మతో దీక్ష విరమింపజేసిన అధికారులు


గోవిందమ్మకు జ్యూస్ తాగించి దీక్ష విరమింపజేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో బీసీ కులస్తుల చేతిలో దాడికి గురై న్యాయం కోసం గోవిందమ్మ చేపట్టిన నిరవధిక దీక్షను అధికారులు దీక్ష విరమింపజేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గ్రామానికి వెళ్లి ఆమెకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బుధవారం దీక్షా శిబిరానికి పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్ చేరుకొని ఆమెకు జ్యూస్ ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో బీసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్, ఏబీసీసీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, మంచాల లక్ష్మీనారాయణ, మాలమహానాడు నాయకులు నర్సన్న, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ మహిళా నాయకురాలు బతుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలతో స్వాగతం


హాన్వాల్‌లో మురుగుకుంట దాటుకుంటూ ముందుకెళ్తున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామంలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే పార్థసారథికి సమస్యలు స్వాగతం పలికాయి. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు లేవని ఎమ్మెల్యేను ఈరమ్మ, నాగమ్మ, అలివేలమ్మ, భీమక్క తదితరులు గట్టిగా ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మీ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని పాఠశాల వద్ద రూ.10 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మల్లప్ప, బీజేపీ నాయకుడు కునిగిరి నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సూపరింటెండెంట్ మృతి


శేఖప్ప (ఫైల్)

ఆదోనిసెంట్రల్: పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హెచ్.శేఖప్ప (51) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. హొళగుంద గ్రామానికి చెందిన శేఖప్ప భార్య మూడు సంవత్సరాల క్రితమే మృతిచెందింది. ఇంతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పశుసంవర్ధకశాఖ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ పి.వి.రమణ, వైద్యులు విజయ్‌కుమార్, కార్యాలయ సీనియర్ క్లర్క్ సాయిబాబా, సిబ్బంది తదితరులు శేఖప్ప మృతి పట్ల సంతాపం తెలియజేశారు. అంత్యక్రియలు గురువారం మృతుడి స్వగ్రామంలో ఉంటాయని చెప్పారు.

మార్కెట్‌యార్డులో వే బ్రిడ్జ్ పునఃప్రారంభం


కాటాపై వాహనం నిలబెట్టి తూకం సరి చూస్తున్న యార్డు అధికారులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జ్ కాటాను యార్డు అధికారులు బుధవారం పునః ప్రారంభించారు. వే బ్రిడ్జ్‌కు మరమ్మతులు చేయించారు. యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, డీఈ సుబ్బారెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఫ్యాక్టరీలలో తూకాలపై అనుమానం వస్తే ముందుగా యార్డులో ఉన్న వే బ్రిడ్జ్‌లో కాటా వేసుకోవాలన్నారు. కాటాలో తేడాలు వస్తే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి


మొక్క నాటి నీరు పోస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని ఖాళీ స్థలంలో ఆయన మొక్కలను నాటారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని సూచించారు. అంతకుమునుపు మార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గుడికల్ రోడ్డులోని మంచినీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఈఈ నీరజ, ఏఈ శరత్‌చంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు గదుల కొరత

- మద్యం దుకాణాలకు దొరకని అద్దె గదులు
- తీవ్రంగా అన్వేషిస్తున్న వ్యాపారులు
- గోనెగండ్లలో ఒక్క దుకాణం మాత్రమే ప్రారంభం
- మరో రెండింటికి ఇంకా షెటర్ దొరకని పరిస్థితి


గోనెగండ్లలో ఏర్పాటు చేసిన మద్యం షాపు

గోనెగండ్ల : మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి, వ్యాపారాలకు అనువుగా ఉండే గదులు దొరక్క వ్యాపారులు తీవ్రంగా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపులు పెట్టకోవడానికి వార్డు పరిధి లేదని, ఎక్కడైనా పెట్టుకోవచ్చని ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో లక్కీ డ్రాలో చేజిక్కించుకున్న వాళ్లు దుకాణం ఎక్కడ పెట్టాలన్న అంశంపై తనిఖీలు ప్రారంభించారు. ఎక్కడ పెడితే వ్యాపారం బాగా జరుగుతుందన్న అంశంపై తీవ్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. బుధవారం సాయంత్రం గోనెగండ్లలో ఒక షాపు మాత్రమే ప్రారంభమైంది. మిగతా వాటికి రాత్రికు కూడా గదులు దొరకలేదు.

నిబంధనలు పాటించాల్సిందే..

షాపులు వచ్చినవారు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు వంద మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల దూరం వరకు షాపులు పెట్టదారు. హైవేలపై మద్యం దుకాణం ఉందని తెలియజేసే ఏ విధమైన సైన్ బోర్డులు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకూడదు. మండల కేంద్రంలో 20 వేల కంటే తక్కువ జానాభా ఉంటే స్టేట్ హైవేలకు 220 మీటర్ల దూరంలో మద్యం దుకాణం పెట్టుకోవచ్చు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయించాలి. ఈ నిబంధనలను అనుసరించి దుకాణాలు పెట్టేందుకు గదులు దొరకకపోవడంతో లైసెన్సు దారులు షాపుల వేటలో పడ్డారు.

గోనెగండ్ల మండలంలో మూడు షాపులు

గత ప్రభుత్వ హయాంలో గోనెగండ్ల మండలం పరిధిలో 3 షాపులు ఉండగా 2 మండల కేంద్రంలో, 1 కైరవాడిలో నిర్వహించారు. ప్రస్తుతం మూడు షాపులనూ మండలకేంద్రంలోనే ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 2షాపులు టీడీపీకి చెందిన ఒకే వ్యక్తికి దక్కగా, మరో దుకాణం సి.బెళగల్‌కు చెందిన వ్యక్తికి దక్కింది.

దరఖాస్తుల ద్వారా రూ.1.48కోట్ల ఆదాయం

మండలం పరిధిలో 3 షాపులకు దాదాపు 74 దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో మూడు షాపులకు గాను రూ.1.48కోట్లు దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి వచ్చింది. ఇందులో ఒక్కొక్కరు 1 నుంచి 5 దరఖాస్తులు చేసుకున్నవారు ఉన్నారు. లాటరీలో ముగ్గురికి దుకాణాలు రాగా మిగిలిన 71 దరఖాస్తులకు చెల్లించిన సొమ్ము రూ.1.42 కోట్లు లక్కు లేక ప్రభుత్వానికి వదిలేసినట్లయింది. మద్యం వ్యాపారస్తులకు లాటరీలో షాపులు రాకపోవడంతో దరఖాస్తుకు కట్టిన రూ.2లక్షలు ప్రభుత్వ హుండీలో వేసినట్లయ్యింది.

తాత్కాలిక లైసెన్సులు జారీ

బుధవారం ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండడంతో మద్యం షాపులు దక్కించుకున్న వారికి వారం పాటు తాత్కాలిక లైసెన్సులను జారీ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. వారం రోజుల తరువాత దుకాణాల ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి శాశ్వత లైసెన్సులను జారీ చేస్తారు.

లోతట్టు ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ పర్యటన


లోతట్టు ప్రాంతాల్లో అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని టౌన్: రెండు రోజుల పాటు భారీ తుపాను సూచన ఉండడంతో ఆదోని పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలతో కలిసి మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు అధికమై లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు వస్తే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన


ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పట్టణంలోని 1, 38, 39, 40 వార్డుల్లో బుధవారం జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలిచ్చారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని రోడ్లపై, కాలువల్లో వేయరాదని, ఇంటి వద్దకు వచ్చే చెత్త బండ్లలో వేయాలని సూచించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తుపాన్ ప్రభావంతో ఇబ్బందులు పడే ప్రజల సహాయార్థం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదోని మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ఎవరైనా వర్షాల ధాటికి ఇబ్బందులు పడుతుంటే అలాంటి వారు 08512-295468 నంబర్‌కు కాల్ చేసి సాయం పొందవచ్చన్నారు. ఈనెల 16, 17వ తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నిశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

ఆలస్యంగా సెలవు ప్రకటనతో విద్యార్థుల ఇబ్బందులు


పట్టణంలోని బాలికల హైస్కూల్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్ష సూచనతో కొన్ని జిల్లాల్లో ముందస్తుగా పాఠశాలలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. అయితే కర్నూలు జిల్లాలో మాత్రం బుధవారం ఉదయం వరకు ఎలాంటి ప్రకటన జారీ చేయకపోవడంతో విద్యార్థులు యథావిధిగా చిరుజల్లులలోనే పాఠశాలలకు తరలివెళ్లారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి హైస్కూల్, జూనియర్, డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చిన తరువాత ఉదయం 8.50గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారులు భారీ వర్షసూచన వున్నందున సెలవు ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలలకు సెలవు ఇస్తున్నట్లు చెప్పడంతో పట్టణం నుంచే కాకుండా గ్రామాల నుంచి వ్యయప్రయాసలతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. పాఠశాలలకు వచ్చిన తరువాత సెలవు ప్రకటించడంతో తాము ఇబ్బందులు పడాల్సివచ్చిందని గ్రామీణ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోయారు. అధికారులు ముందస్తుగా సెలవు ప్రకటిస్తే తమకు వ్యయప్రయాసాలు తగ్గేవని విద్యార్థులు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పునఃప్రారంభించాలి


ఎమ్మెల్యే బీవీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే పునః ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, ప్రభుత్వం దృష్టికి కళాశాల నిర్మాణ సమస్య తీసుకెళ్లాలని కోరారు. జేఏసీ నాయకులు శ్రీనివాసులు, రంగస్వామి, సోమశేఖర్, వీరేష్, ఉదయ్, శశి మాట్లాడుతూ వైద్య కళాశాల నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేయడంతో ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన అడ్మిషన్లు నిలిచిపోయాయన్నారు. కళాశాల పనులు పూర్తి చేస్తే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందడంతో పాటు అన్ని వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి సత్వరం పూర్తి చేయాలని కోరారు.

సీసీ రోడ్లకు భూమిపూజ


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రామాంజినేయులు

పెద్దకడబూరు : మండలంలో రూ. 50లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం పెద్దకడబూరులో రూ. 30లక్షలతో, గంగులపాడు గ్రామంలో రూ. 5లక్షలతో, రాగిమాన్‌దొడ్డి గ్రామంలో రూ. 5లక్షలతో, హనుమాపురం గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ రోడ్లు నిర్మిచనున్నట్లు ఎంపీడీఓ జయరాముడు తెలిపారు. బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు రామాంజినేయులు, ఇందిరమ్మ, పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, ఏపీఓ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

ఎమ్మిగనూరుటౌన్: సమతుల ఆహారం తీసుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా వుంటారని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం కళాశాలలో జువాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.షాజహాన్ అధ్యక్షతన ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన


సాతనూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శాస్త్ర వేత్త డాక్టర్ మౌనిక, ఏడీఏ వెంకటేశ్వర్లు

కోసిగి: మండలంలోని సాతనూరు, అగసనూరు గ్రామాల్లోని పంట పొలాలను కేవీకే బనవాసి శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయక అధికారి వెంకటేశ్వర్లు బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారి రాజు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంలో గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, మిరప, వరి పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు వరి లో వచ్చే ఆకు ముడుత తెగులు నివారణకు క్వినాల్ ఫాస్ 25 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పంటలకు అవసరమైన మేరకు ఎరువులు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఏఓ శశిధర్ రెడ్డి, ఏపీఎమ్ఐపిఏఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

పెద్దకడబూరు : రైతులు వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకుంటే పంటను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పత్తి, మిరుప తదితర పంటలను పరిశీలించారు. వర్షాలకు తడిసిపోయి ఆరబోసుకున్న పత్తిని పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో నీట మునిగిన పొలాలు త్వరగా పుంజుకోవడానికి 5సెంట్లు నారుమడికి 1కిలో యూరియా, 1కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా చల్లుకోవాలన్నారు. అనంతరం లీటరు నీటికి 2గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పై పాటుగా వేసుకోవడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుందన్నారు.

వైఎస్సార్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని వైఎస్సార్ నగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో బుధవారం కౌతాళంలోని వైఎస్సార్ నగర్‌లో సిమెంటు రోడ్డుతో పాటు డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ పాల్‌దినకర్, మండల కన్వీనర్ ప్రహల్లాదాచారి ఆధ్వర్యంలో బ్యాండు మేళాలు డప్పువాయిద్యాలతో వైఎస్సార్ సర్కిల్ నుంచి వైఎస్సార్ నగర్ వరకు ఘనంగా స్వాగతం పలికారు. రూ.15లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్డుకు ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామిలతో కలిసి భూమిపూజ చేపట్టారు. అంతకు ముందు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి, వైఎస్సార్ విగ్రహానికి, కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ ప్రభుత్వ హాయంలో ఎన్నో అభివృద్ధి పనుల్ని చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను స్థానికులు పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ రంగస్వామి, ఏఈలు శ్రీనివాసరెడ్డి, నాగమల్లయ్య, తహసీల్దారు మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, ఉప సర్పంచ్ తిక్కయ్య, కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు నదిచాగి రామన్నగౌడ్, అనిల్‌కుమార్, అబ్దుల్‌సమద్, నాగభూషణ్‌గౌడ్, శివరాం, గురునాథ్‌రెడ్డి, పాండురంగరెడ్డి, నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

పంచాయతీగా గుర్తించాలి

నందవరం : మండల పరిధిలోని రాయచోటి గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గుణశేఖర్, హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాయచోటి గ్రామంలో సీపీఎం నాయకులు నల్లన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..రాయచోటి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవపుత్ర, స్వామిదాసు, దస్తగిరి, శ్రీరాములు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని 60ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో ఉండగా స్థానిక బీసీ సంఘ నాయకులు మంగళవారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందించారు. అయితే తెల్లవారుజామున అతడు మృతి చెందడంతో పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో బుధవారం హిందూ శ్మశాన వాటికలో సంఘ నాయకులు అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కామలె గణేష్, బతకన్న, రామచంద్ర, రాము, నర్సన్న, పోలీసు సిబ్బంది ఖాశిం, లింగన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: హాసన్ ఎక్స్‌ప్రెస్‌లో రాయచూర్ నుంచి బెంగళూరుకు ప్రయాణిస్తున్న అర్ నవీన్ కుమార్(34) అనే వ్యక్తి మంగళవారం రాత్రి రైలు నుంచి జారీ పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు బుధవారం తెలిపారు. రాయచూర్‌లో ఉన్న భార్య, పిల్లలను చూడడానికి వచ్చిన ఆయన తిరిగి హాసన్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబర్. 11311లో బయలు దేరాడని తెలిపారు. జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్న ఆయన కిలోమీటరు నంబర్ 507/15-13 ఇస్వి-కుప్పగల్ అర్ఎస్‌ల మధ్య ప్రమాదవశాత్తు జారీ కింద పడినట్లు వెల్లడించారు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన శివలింగ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడని ఇస్పీ ఎస్ఐ నాగేంద్ర బుధవారం విలేకరులకు తెలిపారు. శివలింగ తన ఇంటి వద్ద 90 ఎం.ఎల్. పరిమాణం గల 140 టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసి, రిమాండ్ పంపినట్లు చెప్పారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నది ప్రవాహన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తాకిడికి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది ఉధృతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, నదిలోకి జాలర్లు, పశువుల కాపర్లు, బట్టలు ఉతకడానికి మహిళలు వెళ్లరాదని హెచ్చరిక జారీ చేశారు. వర్షాల తాకిడికి తుంగభద్ర నదికి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, అందుకు గ్రామాల స్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, వీఆర్వో తిప్పన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల : తుపాను ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మాణి మంజరి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంకా మూడు రోజులు తుపాన్ ప్రభావం ఉండడంతో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాగులు, వంకలు పొంగి రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల వద్ద నీరు ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. అలాగే పాత మట్టి మిద్దెలు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

ఆదోని రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై గళమెత్తారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

బంగారం రికవరీ

ఆదోని అర్బన్: బెంగళూరు పోలీసులు పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో చోరీ బంగారాన్ని రికవరీ చేసిన విషయం బుధవారం ఆలస్యంగా తెలిసింది. 15 రోజుల క్రితం బెంగళూరులో 15 తులాల బంగారం దొంగలించారని కేసు నమోదయ్యింది. విచారణ చేపట్టిన బెంగళూరు పోలీసులు దొంగను పట్టుకున్నారు. ఆ దొంగ ఆదోని పట్టణంలో ఓ బంగారు షాపులో బంగారాన్ని అమ్మినట్లు తెలపడంతో వెంటనే పోలీసులు మంగళవారం ఆదోనికి వచ్చి బంగారం రికవరీ చేసుకుని వెళ్లిపోయినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి విక్రమ్ అనే బాలుడు సైకిల్‌పై వెళ్తుండగా కొత్త బస్టాండు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్‌పోలీసులు తెలియజేశారు.

దుకాణదారుడితో బీజేపీ నాయకుడి ఘర్షణ

ఆదోని అర్బన్: పట్టణంలో ఎరువుల దుకాణదారుడు, బీజేపీ నాయకుడు పరస్పర దాడులు చేసుకున్న ఘటన బుధవారం రాత్రి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. బీజేపీ నాయకుడు కపటి రాజు పట్టణంలోని గీత ఎరువుల దుకాణంలో మినుము విత్తనాలు తీసుకుని అవసరం లేకపోవడంతో తిరిగి ఇచ్చే సమయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇద్దరికి సర్దిచెప్పడంతో వెళ్లిపోయినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి


సభ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వాల్మీకి నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకి జయంతి వేడుకకు వాల్మీకి సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వాల్మీకి జయంతి సభ నిర్వహణ కమిటీ నాయకులు బంగారు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బీఎల్ నారాయణ, కొండయ్య, చిన్న ఈరన్న, లచ్చన్న, రామకృష్ణ నాయుడు, కౌన్సిలర్ దయాసాగర్, యాపీలయ్య, చంద్రన్నలు కోరారు. బుధవారం పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా వాల్మీకి కమ్యూనిటీ హాల్ స్థలంలో నిర్వహించే వాల్మీకి జయంతి సభ ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గురువారం ఉదయం10 గంటలకు పట్టణంలోని అబ్బాస్ థియేటర్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వాల్మీకి విగ్రహనికి నివాళులర్పించిన అనంతరం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉసేని, రాఘవన్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.